క్లుప్తంగా

వంద రోజులు పని కల్పించాలి

ఓజిలి: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించాలని ఎంపీడీవో రజనీ కాంత్ ఆదేశించారు. ఆయన బుధవారం ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ ప్రతి రోజు పని కల్పించేలా గ్రామంలో పనులను సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు ఉపయోగపడే పనులు ఎక్కువగా చేయాలన్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వరకు కూలి వస్తుందని వివరించారు. మస్టర్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఏపీవో ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో చిట్టేడు హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


అథ్లెటిక్ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిట్టేడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

కోట: నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సోమవారం నిర్వహించిన జూనియర్ జిల్లా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో చిట్టేడు ఎన్‌సీఆర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్టు పీఈటీ కృష్ణ తెలిపారు. అండర్–14 బాలికల విభాగం లాంగ్ జంప్‌లో సీహెచ్ రోహిత ప్రథమ స్థానం, అండర్–14 బాలుర విభాగం లాంగ్ జంప్‌లో సీహెచ్ విష్ణువర్ధన్ ద్వితీయ స్థానం, అండర్–16 బాలికల విభాగం లాంగ్‌జంప్‌లో సీహెచ్ గీతిక ద్వితీయ స్థానం, జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానం, సీహెచ్ చెంచువందన జావెలిన్‌త్రోలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు, పీఈటీని హెచ్‌ఎం నిర్మలాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయుడి గైర్హాజరుపై విచారణ


విచారణ జరుపుతున్న ఉప విద్యాశాఖ అధికారి రఘురామయ్య

కలువాయి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గతంలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరైన పి.రామకృష్ణ వ్యవహారంపై కావలి ఉప విద్యాశాఖ అధికారి పి.రఘురామయ్య బుధవారం విచారణ జరిపారు. రికార్డులను తనిఖీ చేశారు. అప్పట్లో హెచ్‌ఎంగా ఉన్న జనార్దన రెడ్డిని, ప్రస్తుత హెచ్‌ఎం అబ్బాస్‌అలీతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న హిందీ ఉపాధ్యాయుడు రామకృష్ణను విచారించారు. వారి నుంచి వివరాలు సేకరించారు. ఈవిషయమై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

స్వామి వివేకానందుడి అడుగు జాడల్లో నడవాలి


గూడూరు రూరల్: నేటి యువత స్వామి వివేకానందుడి అడుగు జాడల్లో నడవాలని ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారణి సభ్యుడు యుగంధర్ తెలిపారు. ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం స్వామి వివేకానందస్వామి చికాగోలో చేసిన ప్రసంగం సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు స్వామి వివేకానంద జీవితంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 1893 సెప్టెంబర్ 11న చికాగోలో జరిగిన విశ్వమత మహాసభలో స్వామి వివేకానంద ప్రసంగించి ప్రపంచానికి భారతదేశ సనాతన ధర్మం గొప్పతనాన్ని వివరించారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి అడుగు జాడల్లో నడిచి భావితరాల వారికి మార్గనిర్దేశకులుగా మారాలని కోరారు. ఆర్ఎస్ఎస్ నాయకులు మల్లికార్జున్, కళాశాల హెచ్‌వోడీలు మూర్తి, మహేంద్ర పాల్గొన్నారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి


విష్ణు(ఫైల్)

తడ: మండలంలోని తడకండ్రిగ పంచాయతీ బీఎల్ పాడు వద్ద బుధవారం బైక్ ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ కొండపనాయుడు కథనం మేరకు.. తడ–శ్రీకాళహస్తి రోడ్డులో ఉంటున్న పవన్ కల్యాణ్ అలియాస్ విష్ణు(26) బీఎల్‌పాడులో బంధువు చనిపోవడంతో చూసేందుకు బైక్‌పై బయలుదేరాడు. బీఎల్ పాడు మలుపు వద్ద సూళ్లూరుపేట నుంచి తడకు వస్తున్న మరో బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన విష్ణును స్థానికులు 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..



గూడూరు రూరల్: పట్టణ సమీపంలోని చల్లకాలువ బ్రిడ్జి సమీపంలో పొలాల వద్ద గుర్తు తెలియని యువకుడు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గూడూరు రూరల్ సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్ అక్కడికి చేరుకుని పరి శీలించారు. అతనికి 25 ఏళ్లు ఉంటాయని, బ్లాకలర్ జీన్స్ ప్యాంటు, చెక్స్ షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. శరీరంపై గాయాలు న్నాయని, ఎవరైనా హత్య చేసి పడేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

చేసిన పనులకు పైపైన మెరుగులు


అక్కరపాక గ్రామంలో తూతూమంత్రంగా చేసిన చెరువు కట్ట మరమ్మతులు


తల్లంపాడు చెరువు కట్టపై పోసిన మట్టి

- చేతివాటం చూపిన తెలుగు తమ్ముళ్లు
- పట్టించుకోని ఇరిగేషన్ శాఖ అధికారులు
- భారీ వర్షాలు వస్తే ఇబ్బందులు తప్పవంటున్న రైతులు

టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డు పెట్టుకుని చెలరేగిపోతున్నారు. చెరువు కట్టలపై చేసిన పనులకు పైపైన మెరుగులు దిద్దుతూ ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు దారితీస్తోంది.

– దొరవారిసత్రం

దొరవారిసత్రం మండలంలో ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న 17 చెరువు కట్టలు ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చెరువు కట్టలు, సప్లయి చానళ్లు, తూములు దెబ్బతిన్నాయి. వాటిని బాగు చేయించేందుకు గత ప్రభుత్వం ఎఫ్‌డీఆర్ కింద రూ.92.07 లక్షల నిధులు మంజూరుచేసింది. ఇందులో మావిళ్లపాడు చెరువుకు రూ.9.70 లక్షలు, మానేరి చెరువుకు రూ.9.50 లక్షలు కేటాయించారు. ఇవి టెండర్ దశలో ఉన్నాయి. మిగిలిన 15 పనులను ఆయా ప్రాంతాల్లోని అధికార పార్టీ నాయకులు దక్కించుకుని సంబంధిత శాఖ అధికారుల సహకారంతో ఇష్టారాజ్యంగా పూర్తి చేశారు. ఇప్పటికే అక్కరపాక, తల్లంపాడు, వడ్డికండ్రిగ, బుదరముడుగు, చందనముడి, ముచ్చలగుంట, చవటకండ్రిగ, బూదూరు, పూలతోట, శ్రీధనమల్లి తదితర గ్రామాల్లోని చెరువు కట్టలు, సప్లయి చానళ్ల పనులను హడావిడిగా పూర్తి చేశారు. కొన్ని చోట్ల అవసరంలేని పనులను తూతూమంత్రంగా చేపట్టారు. చెరువు కట్టలు బాగున్నప్పటికి యంత్రాలతో కట్టకు ఇరువైపులా అక్కడి మట్టిని సర్ది చేతులు దులుపుకున్నారు. కొన్నిప్రాంతాల్లో చెరువు కట్టలు బలహీనంగా లేనప్పటికీ కట్ట పనులు చేసినట్టు పైపైన మెరుగులుదిద్దారు. దీనిపై ఇరిగేషన్ శాఖ ఏఈ కస్తూరయ్య, జేఈ హరికృష్ణ వివరణ ఇస్తూ దొరవారిసత్రం మండలంలో మంజూరైన ఎఫ్‌డీఆర్ పనులను నిబంధనలకు లోబడే చేయించామన్నారు. ఎక్కడా అవినీతి చోటు చేసుకోలేదని, రైతులకు అవసరమైన పనులనే చేయించామని వివరించారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూశామని వెల్లడించారు.

ఆన్‌లైన్ విధానంలోనే కార్యకలాపాలు

చిల్లకూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల లావాదేవీలన్నీ ఆన్‌లైన్ విధానంలోనే చేపట్టాలని డివిజనల్ సహకార శాఖాధికారి రవి రాజశేఖర్ తెలిపారు. ఆయన బుధవారం తిప్పగుంటపాళెంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో సొసైటీ పరిధిలోని రైతులతో కలిసి మహాజన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో సొసైటీలోని ప్రతి రికార్డును చేతితో రాసేవారని తెలిపారు. ఇప్పుడు కంప్యూటరీకరణ చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి రైతూ తమ వివరాలను అందజేయాలని, వేలి ముద్రలను వేసిన అనంతరం ప్రత్యేకంగా ఆ రైతుకు సంబంధించిన పోర్టర్ విడుదల చేస్తారని తెలిపారు. అప్పటి నుంచి అందులో ఆ రైతుకు సంబంధించిన ప్రతి విషయమూ నిక్షిప్తం చేస్తామన్నారు. కంప్యూటరీకరణ కోసం నాబార్డు రూ.200 కోట్లు విడుదల చేసిందన్నారు. దీని వల్ల భవిష్యత్తులో సొసైటీలోని రైతులు రుణాలు తీసుకోవడంలో ఎవ్వరి సిఫార్సులు అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ విద్యాసాగర్, పర్సన్ ఇన్‌చార్జ్ ఇలియాజ్, మాజీ అధ్యక్షుడు యల్లంటి ప్రభాకర రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు నాయుడు, పగడాల శ్రీనివాసులురెడ్డి, రఘురాం రెడ్డి, సీఈవో రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చిల్లకూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో శివజ్యోతి, అసిస్టెంట్ సీడీపీవో జ్యోతి కరణ్ తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వరగలి గ్రామంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేసిన పౌష్టికాహార చిహ్నం అందరినీ ఆకట్టుకుంది. గర్భిణులు క్రమం తప్పకుండా మందులు, పౌష్టికాహారం తీసుకుంటే ప్రసవ సమయంలో ఇబ్బందులు ఉండవన్నారు.

అక్రమ తవ్వకాలపై రెవెన్యూ అధికారుల దాడులు


ముమ్మారెడ్డిగుంటలో మట్టి తవ్వుతున్న జేసీబీ

పెళ్లకూరు: మండలంలోని పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట గ్రామాల్లో ఇసుక, మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు బుధవారం దాడులు చేపట్టారు. స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి సమాచారం అందింది. ఆయన ఆదేశాలతో వీఆర్వో కళ్యాణి దాడులు చేశారు. ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లు అన్‌లోడ్ చేసి పరారయ్యారు. అదేవిధంగా ఇసుక లోడింగ్ చేసే కూలీలు పరుగులు తీశారు. మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ముమ్మారెడ్డిగుంటలోని అసైన్‌మెంట్ భూము ల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్న జేసీబీతో పాటు ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఐపీసీఎల్ క్రికెట్ పోటీల్లో గూడూరు యువకుడి ప్రతిభ


కప్పును చూపుతున్న పురుషోత్తం చౌదరి

చిల్లకూరు: ఐపీసీఎల్ క్రికెట్ పోటీల్లో గూడూరు పట్టణం చర్చి కాంపౌండ్‌లో నివసించే దివ్యాంగుడు కేపీ పురుషోత్తమచౌదరి ప్రతిభ చూపారు. ఆయన బుధవారం గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో విలేకరులతో మాట్లాడారు. కోయంబత్తూరులో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు ఇండియన్ పారా క్రికెట్ లీగ్(ఐపీసీఎల్) పోటీలు జరిగాయన్నారు. ఇందులో 11 జట్లు పోటీ పడినట్టు పేర్కొన్నారు. గెలాక్సీ జెయంట్స్ జట్టు విజేతగా నిలిచిందన్నారు. అందులో ఆంధ్రా నుంచి ముగ్గురు పాల్గొన్నట్టు తెలిపారు. వారిలో తాను ఉన్నట్టు వివరించారు. దాతలు ముందుకు వచ్చి ఆదరిస్తే జాతీయ, అంతర్జాతీయ పోటీలతోపాటు పారా ఒలింపిక్‌లో పాల్గొంటానని తెలిపారు.

మోమిడిలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని మోమిడిలో ఉన్న క్రీడా మైదానంలో 13, 14 తేదీల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల స్పోర్ట్స్ అథారిటీ పర్యవేక్షణలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు జిందాల్ పవర్ లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ పవర్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. 13న పోటీలు ప్రారంభిస్తామని, 14వ తేదీ ఉదయం సెమీ ఫైనల్, మధ్యాహ్నం ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని, అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ


విద్యార్థులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు, ఎంఈవో

నాయుడుపేట టౌన్: మండలంలోని కుప్పరగుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రతినిధులు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ నాయుడు, సభ్యులు ఆదవరం నాగూరయ్య, రామచంద్రారెడ్డి, బట్ట సుబ్రమణ్యం యాదవ్, రామ్మోహన్‌రావు మాట్లాడుతూ తమ సంస్థ తరఫున ప్రభుత్వ పాఠశాలలకు తమవంతు సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి

దొరవారిసత్రం: 40 ఏళ్లు దాటిన మహిళలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సూచించారు. తనియాలి గ్రామంలో బుధవారం తిరుపతి స్విమ్స్, శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో ఉచితంగా చేస్తున్న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల వివరాలను ప్రజలకు వివరిస్తూ ఆయా గ్రామాల్లో ముందుగానే అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుబ్రమణ్యం, నాయకులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగేంద్రనాయుడు, విజయ్, సురేష్‌నాయుడు, జకరయ్య, షబ్బీర్ పాల్గొన్నారు.

ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

- వలంటీర్లు ఉంటే తక్షణమే సహాయ చర్యలు అందేవి
- విరాళాల వివరాలను తక్షణమే ప్రకటించాలి
- వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి(సైదాపురం): కూటమి ప్రభుత్వం వైఫల్యంతోనే విజయవాడ ప్రజలకు వరద కష్టాలు వచ్చినట్టు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం సాక్షితో మాట్లాడుతూ బుడమేరు వాగుకు భారీ వరద వస్తుందని తెలిసినా ప్రజలకు సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ముందుగానే స్పందించి ప్రజలను అప్రమత్తం చేసి ఉంటే, ప్రాణ, ఆస్తినష్టం జరిగేది కాదన్నారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం చేతగాని తనంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. వాతావరణం, నీటి పారుదల శాఖల అధికారులు బుడమేరు వరద విషయం ముందస్తుగా ప్రభుత్వానికి తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ప్రమాదకర పరిస్థితిలోఉన్న వారికి సురక్షిత ప్రదేశాలను తరలించడం, కనీస వసతి కల్పన, ఆహారం, నీరు అందించడం తదితర చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పటికే 60 మంది వరకు ప్రాణాలు కోల్పోయారని, వరదనీటిలో లక్షలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఎంతమంది బాధితులు ఉన్నారో అంచనా వేయడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. వలంటీర్లు ఉండి ఉంటే తక్షణమే బాధితులకు అందరికీ సహాయ సహకారాలు అంది ఉండేవన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన వలంటీర్ల సహాయంతో గతంలో కరోనా విపత్కర పరిస్థితుల్లో మారుమూల ప్రాంత ప్రజలకు సైతం వైద్య సేవలు అందాయని గుర్తు చేశారు. ఇటువంటి వలంటీర్ల వ్యవస్థ కొనసాగించి ఉంటే ప్రస్తుతం విజయవాడలో జరిగిన వరద ప్రవాహంలో నష్టపోయిన ప్రతి బాధితుడికీ అండగా నిలిచేందుకు వీలుగా ఉండేదన్నారు. వర్షాల కారణంగా ప్రాణనష్టంతోపాటు రూ.వేల కోట్ల ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇప్పటికీ విజయవాడలో పరిస్థితి దారుణంగా ఉందని, ప్రజలకు పూర్తిస్థాయిలో సహాయక చర్యలు అందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముంపు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు నిత్యావసర సరుకులతోపాటు ఆర్థిక సాయం అందించాలన్నారు. వరదల్లో కొట్టుకుపోయిన ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు, దెబ్బతిన్న ఇళ్లకు కూడా పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రభుత్వానికి అందుతున్న విరాళాల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

సంప్రదాయాలను అనుసరిస్తూ జాతర నిర్వహణ

- అమ్మవారి జాతర నిర్వహణకు రాజాల అభిముఖి


తాంబూలం అందజేస్తున్న సాయికృష్ణయాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర

వెంకటగిరి(సైదాపురం): దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహణను సంప్రదాయాలను అనుసరిస్తూ వైభవంగా నిర్వహించాలని వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర తెలిపారు. వెంకటగిరి రాజా ప్యాలెస్‌లోని బొడ్డుసైగా మండపంలో బుధవారం జాతర నిర్వాహణకు అభిముఖి వ్యక్తం చేస్తూ సంప్రదాయబద్ధంగా రాజా కుటుంబ సభ్యులు సాయికృష్ణయాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర వెంకటగిరి గ్రూప్ ఆలయాల ఈవో శ్రీనివాసులురెడ్డికి తాంబూలం అందజేశారు. డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ వెంకటగిరిలో పోలేరమ్మ జాతర ఎప్పుడు ప్రారంభమైందో తెలియదన్నారు. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోందని వివరించారు. పోలేరమ్మ కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జాతర నిర్వహణకు సంబంధించి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పర్యవేక్షణలో సంప్రదాయాలను గౌరవిస్తూ అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని కోరారు. సర్వజ్ఞకుమార యాచేంద్ర మాట్లాడుతూ వెంకటగిరి పోలేరమ్మ జాతర దేశ నలుమూలల కీర్తి ఘడించిందన్నారు. లక్షలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎవరికీ అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ఏవీ రమణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, కౌన్సిలర్ నారాయణ, టీడీపీ నేతలు బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథం, సుబ్రమణ్యం, గర్ల శ్రీనివాసులు, కె రమేష్, బాబు, మధు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నిరసన ర్యాలీ


నిరసన తెలుపుతున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

కోట: ఎస్సీ వర్గీకరణ వద్దని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. వారు బుధవారం కోటలో క్రాస్ రోడ్డు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బహుజనుల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్న వారంతా సమైక్యం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మీజూరు మాధవ్, అరవ పార్వతయ్య, దాసరి సుందరం, వసంత్, హేమంత్, అశోక్‌కాంబ్లే, రంగనాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

త్వరితగతిన వంతెన మరమ్మతు పనులు


అధికారులతో సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

వాకాడు: గత ఏడాది సంభవించిన భారీ వరదల కారణంగా కొట్టుపోయిన బాలిరెడ్డిపాళెం సమీపంలోని స్వర్ణముఖి నదిపై ఉన్న వంతెన మరమ్మతు పనులను త్వరితగతిన ప్రారంభించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం బాలిరెడ్డిపాళెం వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక రైతులు, ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభంకాక ముందే బ్రిడ్జి మరమ్మతు పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని పేర్కొన్నారు. అనంతరం వారం రోజుల్లో పనులు ప్రారంభించే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఇరిగేషన్ డీఈ సుబ్బారావు పాల్గొన్నారు.

గణనాథులకు ఘనమైన పూజలు

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు బుధవారం పలుచోట్ల ఏర్పాటు చేసిన గణనాథులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అనంతరం వాహనాలపై కొలువుదీర్చి నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువకుల నృత్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రం వద్ద నిమజ్జనం చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

–కోట/నాయుడుపేట టౌన్/దొరవారిసత్రం/చిల్లకూరు/గూడూరు రూరల్



నాయుడుపేట టౌన్: లడ్డూ దక్కించుకున్న యువతను సత్కరిస్తున్న వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, వినాయకుని విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

- మండల కేంద్రమైన కోట బజారువీధి, దళితవాడ, ఎస్ఎల్‌జీసీ, మహాలక్ష్మమ్మ వీధి, విద్యానగర్, చెందోడులో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాల వద్ద అన్నదానం చేశారు. అనంతరం ఊరేగింపుగా తూపిలిపాళెం సముద్రం వద్దకు తరలించి నిమజ్జనం చేశారు.
- నాయుడుపేట పట్టణం ముస్లిం వీధిలో హిందూ, ముస్లిం యువకులు రంగులు చల్లుకుంటూ కోలాహలంగా గణపయ్యను నిమజ్జనానికి తరలించారు. అలాగే రామకృష్ణాపురం, మూకాంబికా వీధి, గాంధీ పార్కు, సత్యసాయి మందిరం తదితర ప్రాంతాల్లోని భారీ వినాయక విగ్రహాలను క్రేన్‌ల ద్వారా వాహనాలపై ఉంచి ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. పలుచోట్ల అన్నదానం చేశారు.
- దొరవారిసత్రం మండలంలోని కుప్పారెడ్డిపాళెం, ఏకొల్లు, బూదూరు, సింగనాలత్తూరు, పోలిరెడ్డిపాళెం, మీజూరు, తొగరాముడి తదితర గ్రామాల్లో ఏర్పాటచేసిన వినాయకుడి విగ్రహాలను ఐదవ రోజు నిమజ్జనానికి సముద్ర తీరానికి తరలించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి నిమజ్జనం చేశారు.
- మండల కేంద్రమైన చిల్లకూరులోని కోకోలు గార్డెన్‌లో వినాయక విగ్రహం వద్ద స్థానికులు, పైపుల పరిశ్రమ యజమాని బాబు కుటుంబ సభ్యులు భారీ అన్నదానం చేశారు. అదేవిధంగా పలుచోట్ల వినాయకుడి విగ్రహాల అన్నదానం చేసి నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ కోలాహలంగా గడిపారు.
- గూడూరు పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రంలో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు

పోటాపోటీగా లడ్డూ వేలంపాటలు

నాయుడుపేట టౌన్: పట్టణంలో పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద బుధవారం లడ్డూ వేలం పాటలను నిర్వహించారు. రామకృష్ణాపురం వీధిలో వినాయకుని విగ్రహం లడ్డును జగదీష్, సాయి, కాలగంధ సునీల్ వారి స్నేహితులు కలిసి రూ.1.15 లక్షలకు దక్కించుకున్నారు. వారిని మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, నాయకులు పాపాడి చంద్రారెడ్డి అభినందించారు. అదే విధంగా వినాయకుని మెడలో ఉన్న రూ.5ల నగదు మాలను పట్టణానికి చెందిన నీలిశెట్టి నాగేంద్ర రూ.20 వేలకు దక్కించుకున్నాడు. మూకాంబికా గుడి సమీపంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద లడ్డూను విక్కీ, కిషోర్, సుదీప్, అనిల్ మిత్ర బృందం రూ.1.10 లక్షలకు దక్కించుకున్నారు. మాలయకోటలో విగ్రహం వద్ద ఉన్న లడ్డూను రూ.1.05 లక్షలకు ప్రసాద్ సొంతం చేసుకున్నాడు.



దొరవారిసత్రం: నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడి విగ్రహం, చిల్లకూరు: భక్తులకు అన్నదానం



గూడూరు రూరల్: నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు, నాయుడుపేట టౌన్: ఎల్ఏ సాగరం అగ్రహారపేటలో అన్నదానం